క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముధోల్: మండల కేంద్రంలో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీగలు, స్తంభాలకు మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

26న ఇసుక వేలం

లక్ష్మణచాంద: కలెక్టర్ ఆదేశాల మేరకు సీజ్ చేసిన 75 క్యూబిక్ మీటర్ల ఇసుకను ఈనెల 26న తహసీల్దార్ కార్యాలయంలో వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ జానకి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల మండలంలో నిమునిపెల్లిలో అక్రమంగా తరలిస్తున్న 25 ట్రాక్టర్ల ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఒక్కో ట్రాక్టర్(మూడు క్యూబిక్ మీటర్లు)కు రూ.1800 చొప్పున ప్రారంభ ధరగా నిర్ణయించామని.. ఆ సక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

26 నుంచి దమ్మ ఉపాసిక శిబిర్

తానూరు: మండలంలోని కల్యాణి గ్రామంలో ఈనెల 26 నుంచి మార్చి 6 వరకు భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో దమ్మ ఉపాసిక శిబిర్ నిర్వహించనున్నట్లు భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు వాగ్మారే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన భారతీయ బౌద్ధ మహాసభ మహిళా సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కుంటాల: మండలంలోని కల్లూర్ కేజీబీవీలో శుక్రవారం వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు డ్యాన్స్ చేస్తూ ఉత్సాహంగా గడిపారు. ఈసందర్భంగా ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్‌వో సువర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిల్వనీటితో రోగాల ముప్పు

లక్ష్మణచాంద: నిల్వనీటితో రోగాల ముప్పు పొంచి ఉందని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ ఇళ్ల వద్ద నీటి తొట్టిల్లో, కుండీల్లో, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు.పరిసరాల్లో నీరు నిల్వకుండా చూడాలని సూచించారు. ఏఎస్ఎం సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవమూర్తుల ఊరేగింపు


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ 34వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులను పురవీధుల్లో భాజా భజంత్రీల నడుమ ఊరేగింపు నిర్వహించారు. శనివారం శ్రీమాతా దేవి సమేత శ్రీ ముద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన

తానూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం భారత ఎన్నికల ప్రక్రియ, విధి విధానాలపై తహసీల్దార్ లింగంమూర్తి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఓటరు జాబితాలో ఏడాదికి ఒకసారి మాత్రమే మార్పులు చేయగా.. ఇప్పుడు మూడు నెలలకోసారి మార్పులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఓటరు నమోదు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ సింగ్, డిప్యూటీ తహసీల్దార్ గంగయ్య, ఆర్ఐ మోహన్‌సింగ్, ప్రధానోపాధ్యాయులు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

రేపు స్క్రీనింగ్ టెస్ట్

సోన్: సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈనెల 25న మండలంలోని లెఫ్ట్‌పోచంపాడ్ గురుకులంలో సెకండ్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.ప్రేమలత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని.. 9 గంటలకు హాల్ టికెట్లతో పరీక్ష కేంద్రానికి రావాలని కోరారు.

బస్టాండ్‌లో సౌకర్యాలేవి?

- ఏళ్లుగా తీరని తాగునీటి సమస్య
- ఫ్యాన్లు సరిగా లేక ప్రయాణికులకు తప్పని ఉక్కపోత
- పూర్తిస్థాయి సీసీ ప్లాట్‌ఫాం కరువై దుమ్ముధూళితో ఇక్కట్లు


నిరుపయోగంగా కుళాయి


అపరిశుభ్రంగా బస్టాండ్ ఆవరణ

ఖానాపూర్: నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌లో బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. పేరుకు మున్సిపాలిటీ అయినప్పటికీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఐదారేళ్లుగా తాగునీటి సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో కుళాయిలు నిరుపయోగంగా మారాయి. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పేరిట మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్టాండ్‌కు వచ్చేవారి సంఖ్య పెరిగింది. సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి.

ఫ్యాన్లు లేక ఉక్కపోత..

ఓ వైపు వేసవికాలం సమీపిస్తుండడంతో బస్టాండ్‌లో ఫ్యాన్లు సరిగా లేవు. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చేవారు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు ప్లాట్‌ఫాం చిన్నగా ఉండటంతో కూర్చునేందుకు స్థలం లేక నిల్చొని బస్సుల కోసం వేచిచూస్తున్నారు. మరికొందరు బస్టాండ్ సమీపంలోని దుకాణాల వద్ద కూర్చొంటున్నారు. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలు, పశువులు బస్టాండ్ ఆవరణలోకి వస్తున్నాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. బస్టాండ్ ఆవరణలో సైకిల్‌స్టాండ్, మోటార్ స్టాండ్ ఉన్నప్పటికీ ప్రాంగణంలో ఇష్టానుసారం వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ సైతం నామమాత్రంగానే ఉంది.


నోపార్కింగ్ వద్ద నిలిపిన ప్రైవేట్ వాహనాలు

ధ్వంసమైన సెప్టిక్‌ట్యాంక్..

బస్టాండ్ ప్రాంగణంలోని సెప్టిక్ ట్యాంక్ ధ్వంసం కావడంతో దుర్వాసన వస్తోంది. మరోవైపు ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. విద్యుత్ దీపాలు సరిగా లేక రాత్రి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బస్టాండ్ ఆవరణలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేవారు కరువయ్యారు. తాగునీరు, ఫ్యాన్లు, విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేసి పరిశుభ్రత చర్యలు చేపట్టాలి. చుట్టూ ప్రహరీ నిర్మించి ప్రైవేట్ వాహనాలు, పశువులు లోనికి రాకుండా చూడాలి. సెప్టిక్‌ట్యాంక్ దుర్వాసన రాకుండా మరమ్మతులు చేపట్టాలి.

– భూమేశ్, ఖానాపూర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రైవేట్ వాహనాలు బస్టాండ్‌లోకి రాకుండా పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. తాగునీరు, ఇతర కనీస సౌకర్యాలు కల్పించి ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటాం.

– జెట్టి శంకర్, కంట్రోలర్

సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బ్లాక్ డే

భైంసాటౌన్: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.రాజు మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు బ్లాక్ డే నిర్వహించినట్లు పేర్కొన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేదా అని ప్రశ్నించారు. రైతుల ఉద్యమంపై దాడులు చేస్తున్న మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. రైతులపై కాల్పులకు ఆదేశించిన హరియాణా ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు మృతికి బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్, ఎం.హరిత తదితరులు ఉన్నారు.


నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 58 మంది పదో తరగతి విద్యార్థులకు నిర్మల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆల్ ఇన్ వన్(స్టడీ మెటీరియల్) పంపిణీ చేశారు. శుక్రవారం వడ్యాల్‌కే చెందిన విశ్రాంత ఏడీసీసీ మేనేజర్ అట్ల లింగారెడ్డి సమకూర్చిన రూ.16,500 విలువైన మెటీరియల్ అందజేశారు. ఈసందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.పురుషోత్తంరెడ్డి మాట్లాడారు. విద్యాశాఖ ఏటా నిర్వహించే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తానన్నారు. 10 జీపీఏ సాధించిన వారికి, బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందిన విద్యార్థుల ఖర్చు భరిస్తానని హామీ ఇచ్చారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, లింగారెడ్డి, క్లబ్ సభ్యులు చంద్రమోహన్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సాయిబాపురెడ్డి, లక్ష్మీనారాయణగౌడ్, సీఆర్పీ సుధాకర్ పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న సభ్యులు

'కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలాభివృద్ధి'

కుంటాల: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ముధోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని అందాకూర్‌లో ఉపాధిహామీ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. తెల్లరేషన్ కార్డుదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే సిలిండర్ అందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, అందకూర్ ఎంపీటీసీ దాసరి మధుకర్ మాజీ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, మాజీ ఎంపీపీలు భోజరాం పటేల్, రాంచందర్‌రెడ్డి, ఓం ప్రకాశ్ లడ్డా, మోతీలాల్ పటేల్, మగ్గిడి దిగంబర్, మహేశ్, సయ్యద్ కలీం తదితరులు ఉన్నారు.


భూమిపూజ చేస్తున్న నారాయణరావు పటేల్

కుభీర్‌లో సామాజిక తనిఖీ ప్రజావేదిక

కుభీర్: మండల కేంద్రంలోని మండల పరిషత్తు కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం రాత్రి వరకు కొనసాగింది. మండలంలోని గ్రామాల్లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులు, కేటాయించిన నిధుల లెక్క వివరాలను అధికారుల బృందం పరిశీలించింది. పనుల జరిగిన దానికి.. ఖర్చు చేసిన నిధులకు కొంత తేడా వచ్చినట్లు ప్రజావేదికలో వెల్లడైంది. కూలీల పనికి తక్కువ డబ్బులు రావడం, తెలంగాణ క్రీడా ప్రాంగణం కొలతల్లో తేడా రావడం, పని ప్రదేశాల్లో నేమ్ బోర్డులు లేకపోవడం కూలీలకు జాబ్‌కార్డులు లేకపోవడం వంటి తప్పులు జరిగినట్లు తేల్చారు. కేవలం అధికారులు తప్ప ప్రజావేదికకు గ్రామాల్లోని ప్రజలెవరూ హాజరు కాలేదు. డీఆర్డీవో విజయలక్ష్మి, ఎస్సార్పీ సాంబశివచారి, సుధాకర్, ఎంపీపీ తూము లక్ష్మీబాయి, మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, ఎంపీడీవోలు రమేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

ఖానాపూర్: ఇటీవల నూతన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి.మనోహర్‌ను శుక్రవారం తన కార్యాలయంలో మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. గతంలో కొద్ది నెలలు మనోహర్ ఇక్కడ పనిచేశారు. ఖానాపూర్ పట్టణ అభివృద్ధికి సమష్టిగా పని చేసి ప్రజల సమస్యలను పరిష్కారిద్దామని కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు కావలి సంతోష్, పరిమి సురేశ్, కిశోర్‌నాయక్, జన్నారపు శంకర్, నాయిని సంతోష్, తొంటి శ్రీనివాస్, షబ్బీర్ పాషా ఉన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

పెంబి: మండల కేంద్రంలో నూతన ఎంపీడీవో రమాకాంత్‌ను శుక్రవారం మండలంలోని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవోను నాయకులు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నీల్ రెడ్డి, అశోక్‌రావు, శంకర్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగకు చెందిన బ్రహ్మపురం కృష్ణ ఇటీవల పాము కాటుతో మరణించాడు. శుక్రవారం జైజవాన్, జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.ఐదు వేలు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బత్తుల ఉదయ్‌కుమార్, సాయి, రమేశ్, నరేశ్, గణేశ్, గంగన్న, తదితరులు ఉన్నారు.

గంగస్నానానికి పెద్దమ్మ తల్లి గజాలు

పెంబి: మండలంలోని మందపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి గజాలు శుక్రవారం గంగస్నానానికి బయలుదేరాయి. మూడు రోజుల కిందట గ్రామంలో తిరుగుతూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఖానాపూర్‌లోని గోదావరి తీరానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణం రాత్రికి పెద్దమ్మ ఆలయానికి చేరుకుంటారు. ఆదివారం పెద్దమ్మ తల్లి కల్యాణం, జాతర వైభవంగా నిర్వహిస్తారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం

దస్తురాబాద్: మండల కేంద్రంలో ఉపాధిహామీ నిధులు రూ.10లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను ఎంపీపీ సింగరి కిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఏటా వర్షాకాలంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడేవారని.. సీసీ రోడ్డు నిర్మాణంతో ఆశ్రమ విద్యార్థుల కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజునాయక్, ఎంపీడీవో రమేశ్, బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మణ్, చుంచు వెంకన్న, రాజేశం, రాయమల్లు, తిరుపతి, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

భైంసాటౌన్: భైంసా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సీడీపీవోగా శ్రీమతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించిన నాగలక్ష్మి స్థానంలో శ్రీమతికి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆమె ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

మామడ: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో రమేశ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. మండలంలోని నర్సరీలు, ప్రకృతి వనాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ఉపాధి పనుల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీవో శివాజీ, ఎంపీవో గోవర్ధన్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రమేశ్

ఖానాపూర్ బల్దియా పీఠం ఎవరిదో!

- 28న కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక
- కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేసిన మున్సిపల్ కమిషనర్

ఖానాపూర్: ఖానాపూర్‌లో ఇటీవల చైర్మన్, వైస్‌చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మాణం నెగ్గిన విషయం తెలిసిందే. దీంతో పదవి కోల్పోయిన చైర్మన్, వైస్ చైర్మన్ స్థానంలో కొత్త వారిని ఎన్నుకునే ప్రక్రియ ప్రారంభమైంది. ఈమేరకు అధికారులు చర్యలు చేపట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి చెందిన 9 మంది కౌన్సిలర్లు ఈనెల 5న ప్రిసైడింగ్ అధికారి రత్నకల్యాణి సమక్షంలో జరిగిన సమావేశంలో అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఈనెల 28న నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేశామని మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎవరనే చర్చ ఇప్పుడు పట్టణంలో జోరుగా సాగుతోంది. కొత్త పాలకవర్గం కొలువుదీరితే సమస్యలు పరిష్కారం అవుతాయని పట్టణ ప్రజలు భావిస్తున్నారు.


ఈనెల 5న అవిశ్వాసంలో పాల్గొన్న కౌన్సిలర్లు

ఎమ్మెల్యే నందిత మృతి బాధాకరం

ఖానాపూర్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణం వార్త తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. చిన్న వయసులో ఎమ్మెల్యేగా గెలిచిన నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నిర్మల్‌టౌన్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తనను ఎంతో బాధకు గురి చేసిందని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరడంతోపాటు వారి కుటుంబసభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.

నిర్మల్‌టౌన్: ఎమ్మెల్యే లాస్య మృతి బాధాకరమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు ఓ ప్రకటనలో తెలిపారు. వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని కోరారు.

లక్ష్మణచాంద: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి తీరని లోటని లక్ష్మణచాంద జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అల్ఫోర్స్‌లో వీడ్కోలు వేడుకలు


భైంసాలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్ అల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పట్టుదల, ప్రణాళికతో ఉన్నత చదువులు చదవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలు ప్రదానం చేశారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

భైంసాటౌన్: పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. బాగా చదివి ఉత్తమ మార్కులు సాధించాలని చైర్మన్ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు

ముగిసిన రథసప్తమి పూజలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ ఆలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న రథసప్తమి వేడుకలు శుక్రవారం ముగిశాయి. తాళ సప్తాహంలో భాగంగా అభిషేకం, సింధూర అర్చన, గోపాల కాలువ, ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్నరామయ్య, తాజా మాజీ సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు కొంద్ర రమేశ్, బర్కుంట గంగారాం, బర్కుంట నరేందర్, మిట్టపల్లి రాజేందర్, రాజారెడ్డి, రాములు, సాయికృష్ణ, గంగారాం, భోజారెడ్డి, ప్రవీణ్, రవికుమార్ శ్రీధర్ తదితరులున్నారు.


పూజలు చేస్తున్న భక్తులు

ముస్తాబైన రాజరాజేశ్వరాలయం

- నేటి నుంచి మస్కాపూర్‌లో ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని రాజరాజేశ్వరాలయంలో శనివారం నుంచి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలలు నిర్వహించనున్నారు. ఇప్పటికే నూతనంగా నిర్మించిన ఆలయాన్ని కమిటీ సభ్యులు సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 24న గణపతిపూజ, స్వస్తివచనం, పంచగవ్య మేళనం, రక్షాబంధన దీక్ష స్వీకారం, రుత్విక్‌వరణం, అఖండదీపస్థాన, అంకురారోపణం, యాగశాల ప్రవేశం, షోడశస్తంభపూజ, కర్పూరి స్థాపన, అగ్నిప్రతిష్ఠ, వాస్తుపూజ, వాస్తుబలి, నవగ్రహ, మాతృక జలాధివాసం, ఆదివాస హోమం, 25న గణపతిపూజ, హోమం, ఆదిత్య యంత్రోపరి ద్వారదశాదిత్య ఆరాధన, అరుణ పారాయణం, మహాసార అరుణహోమం, నవకలశ స్నానం, ధాన్యాదివాసం, 26న నాగసుబ్రహ్మణ్య విశేష పూజ, ఫలపుష్పాదివాసాలు, ఆదివాస హోమాలు, మహాలింగార్చన, 27న ధ్వజస్తంభ సంస్కారం, నవచండీ పారాయణం, అష్టభైరవ సహిత చండీ హోమం, సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నారు.

28న ప్రతిష్ఠాపన, కల్యాణం..

ఉత్సవాల్లో భాగంగా 28న కలాన్యాస అంగ సంభార శాంతి పాష్టిక హోమం, మూలమంత్ర హోమాలు, గర్తన్యాస రతాన్యాస, దాత, బీజన్యాసతో పాటు శ్రీహంపి విరూపాక్ష విద్యారణ్య స్వామి కరకమలములచే యంత్రస్థాపన, మూర్తి ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ హోమాలు, విగ్రహ ప్రాణప్రతిష్ఠ, అష్టదిక్పాలక క్షేత్రపాలక బలిప్రధానం, మహాపూర్ణాహుతి, మండపదేవతా ఉద్వాసన కుంభప్రోక్షణ, శిఖర ప్రోక్షణ, నూతన మూర్తీనాం ప్రథమ పూజ, పార్వతి పరమేశ్వరుల శాంతి కల్యాణం, తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. వేడుకలకు రావాలని శుక్రవారం ఉట్నూర్‌లోని తమ నివాసంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే సుమన్‌రాథోడ్‌తోపాటు పలువురు ప్రముఖులకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానాలు అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.


ముస్తాబైన ఆలయం